క్లుప్తంగా

ఆరు లారీల స్వాధీనం



బుచ్చినాయుడుకండ్రిగ పోలీసుస్టేషన్‌లో ఉన్న లారీలు

బుచ్చినాయుడుకండ్రిగ: రికార్డులు సక్రమంగా లేకుండా సరుకులను తరలిస్తున్న ఆరు లారీలను ఆదివారం సేల్స్ ట్యాక్స్ డిప్యూటీ అడిషనల్ కమిషనర్ రాజగోపాల్‌రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ లారీల ద్వారా సరుకులను తీసుకెళ్లుతున్న వ్యాపారులు ప్రభుత్వానికి సేల్స్ ట్యాక్స్ చెల్లించి, సంబంధిత రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వాహనాల రికార్డులు సక్రమంగా లేకుండా సరుకులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ఓవరు లోడు లారీలతో రోడ్లు దెబ్బతింటాయని పేర్కొన్నారు. అనంతరం ఆయన పట్టుకున్న లారీలను స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

శ్రీకాళహస్తి: గ్రామీణుల ఇంటి ముంగిటకే కార్పొరేట్ వైద్యం అందజేస్తామని ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ అన్నారు. పట్టణంలోని తుపాస్ సెంటర్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 150మంది పాల్గొని వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మయూర్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి, పరిసర గ్రామాలలో ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు సిరనంబూదూరులో గడప గడపకూ మన ప్రభుత్వం

వరదయ్యపాళెం : సత్యవేడు మండలం సిరనంబూదూరులో సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సిరనంబూదూరు, పాదిరివేడు, బాలకృష్టాపురం గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీశ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముక్కంటి సేవలో రామజన్మభూమి మహంత్



ఆలయంలో మహంత్ కమల్ నయస్‌దాస్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం ఆయోధ్య శ్రీరా మ జన్మభూమి ట్రస్టు ఉపాధ్యక్షులు మహంత్ కమల్ నయస్‌దాస్‌జీ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రేణిగుంటలో ట్రాఫిక్..ట్రాఫిక్

రేణిగుంట ఆర్‌టీసీ బస్టాండు పరిసరాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఇరుకైన రోడ్లలో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఇరుక్కుపోయి పాదచారులను, వాహనదారులను అవస్థలకు గురిచేస్తున్నాయి. బస్టాండ్, రైల్వే స్టేషన్ పక్కపక్కనే ఉండడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. పోలీసు అధికారులు రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. ప్రతి శనివారం సంత రోజు వాహనదారుల కష్టాలు చెప్పనక్కర్లేదు.

- ఇరుకైన రోడ్లతో నిత్యం ట్రాఫిక్ స్తంభన
- ఎదురెదురుగా బస్సులు వస్తే అంతే
- వెతలకు గురవుతున్న ప్రయాణికులు



బస్టాండ్ వద్ద ఇరుక్కుపోయిన ఆర్‌టీసీ బస్సులు



బస్టాండు ప్రాంగణంలో ఆటోలు



బస్టాండు సమీపంలోని ఇరుకైన మెయిన్ బజారు వీధి

రేణిగుంట: రేణిగుంట ఆర్‌టీసీ బస్టాండు కేంద్రంగా శ్రీకాళహస్తి, కోడూరు, తిరుపతి, పుత్తూరు మార్గాలకు వాహనాలు, బస్సులు రోజూ వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నాయి. బస్టాండు నుంచి తిరుపతి వెళ్లే మార్గం, ఇటు బైపాస్‌కు వెళ్లే మార్గం ఇరుకైన రహదారి కావడంతో ఎదురెదురుగా రెండు బస్సులు వస్తే ఇరుక్కుపోయి వెనుక వాహనాలన్నీ బారులుతీరాల్సిన పరిస్థితి. పోలీసులొచ్చి ట్రాఫిక్‌ను తొలగించే వరకు వాహనాలు అక్కడే బారులు తీరడం నిత్యకృత్యంగా మారుతోంది. రోడ్డు విస్తరణ జరిగితే గానీ సమస్యకు పరిష్కారం లభించదని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. రేణిగుంట రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండుకు ఆనుకుని ఉండడంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యాత్రికులు రోజు పెద్దసంఖ్యలో వివిధ వాహనాలను ఆశ్రయించి తిరుపతికి రాక పోకలను సాగిస్తుంటారు. వాహనాల రాక,పోకలు ఎక్కువగా ఉండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ప్రధానంగా రేణిగుంట ఆర్‌టీసీ బస్టాండు ఆవరణంలోనే ఆటో స్టాండు ఉంది. ఆటో స్టాండ్‌లోని ఆటోలు రోడ్డుకు అడ్డంగా పార్కింగ్ చేసి ప్రయాణికులను ఎక్కించుకోవడం కూడా సమస్యకు దారి తీస్తోంది. దీనికితోడు ద్విచక్ర వాహనదారులు దుకాణాల ముందు పార్కింగ్ చేస్తుండడం పెద్ద వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడేందుకు కారణమవుతున్నాయి. ప్రతి శనివారం రేణిగుంటలో సంత జరుగుతుంది. ఈ సంతకు చుట్టు పల్లెల నుంచే కాకుండా తిరుపతి, పుత్తూరు, ఏర్పేడు నుంచి కొనుగోలు దారులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆరోజు రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహన దారుల కష్టాలు చెప్పనలివికాదు. రేణిగుంట బస్టాండు కేంద్రంగా ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య నియంత్రణకు పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

నిత్యం సమస్యే..

రేణిగుంట బస్టాండు పరిసరాల్లో నిత్యం వాహనాలు ఇరుక్కుపోయి ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. బస్టాండు ప్రాంగణంలో కొన్ని దుకాణాలను తొలగించడంతో బస్సులు నిలిచే స్థలం కొంత మేరకు విశాలమైంది. అయినా ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావడం లేదు. అధికారులు చొరవ చూపాలి.



–రూపేష్‌కుమార్, ప్రయాణికుడు

రోజూ తనిఖీలు చేస్తున్నాం

రేణిగుంటలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రోజూ వాహనాలను ఒక వైపే నిలిపేలా ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా రోడ్డుకు అడ్డంగా వాహ నాలు, రాకపోకలకు ఇబ్బందిగా పార్కింగ్ చేస్తే ఫైన్లు వేస్తున్నాం. వాహనాలు క్రమ పద్ధతిలో నిలపాలని ఆటోడ్రైవర్లకు ఆదేశాలిచ్చాం. గతంలో పోలిస్తే ట్రాఫిక్ సమస్య మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నాం.

– ఈశ్వరయ్య, ఎస్ఐ, రేణిగుంట అర్బన్

బస్సుల కోసం విద్యార్థుల నిరీక్షణ



బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు(ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు, అరిగిలకండ్రిగ, వీఎస్‌పురం, పద్మావతిపురం, పదవమైలు గ్రామాల నుంచి పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఈ గ్రామాల నుంచి బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాల గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ప్రతిరోజూ 70 మంది విదార్థులు వెళుతుంటారు. సకాలంలో బస్సులు రాకపోవడంతో పిల్లలు సమయానికి పాఠశాలకు వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను పాఠశాల సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వినాయకునికి రూ.6లక్షల విరాళాలు





విరాళాన్ని అందజేస్తున్న దాతలు బాలకృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి, దాతలకు ప్రసాదాలు అందిస్తున్న ఈఓ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామికి ఆదివారం భక్తులు రూ.6లక్షలు విరాళంగా అందించారు. ఉదయం స్వామివారి నిత్యాన్నదానానికి ఐరాల మండలం చినకాంపల్లెకు చెందిన బాలకృష్ణారెడ్డి పేరున ఆయన కుమారులు సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి రూ.5లక్షలు, అలాగే కర్నూలుకు చెందిన దాత సుబ్బకృష్ణ నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, వేదపండితులచే ఆశీర్వచనం ఇప్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు.

వినాయకుని సన్నిధిలో నెల్లిమర్ల ఎమ్మెల్యే

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామిని విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అప్పలనాయుడు ఆదివారం దర్శించుకున్నారు. మధ్యాహ్నం స్వామివారి దర్శనార్థం ఆయన కుటుంబసమేతంగా విచ్చేయగా, ఈఓ వెంకటేశు ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం ఇప్పించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు.

యూటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ఆవరణలో మండలశాఖ అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలి రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా హేమాంబరధర రావు, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా చెంచయ్య, మోహన్, వేణుగోపాల్, దినమణి, విజయ్‌కుమార్, రమేష్‌ను ఎన్నుకున్నారు. హైస్కూల్, సీపీఎస్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా ఎస్.ధనలక్ష్మిని ఎన్నుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్‌గా జిల్లా కార్యదర్శి జీ.శ్రీనివాసులు, ఎన్నికల అధికారిగా ఎం.దామోదరం శెట్టి వ్యవహరించారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో సీపీఎస్‌ను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు, పీఎఫ్ లోన్స్, ఎంఆర్ బిల్స్, పీఆర్‌సీ బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు.

మంచాలు, సరుకుల వితరణ



ఏర్పేడు: మండలంలోని వికృతమాల సమీపంలోని లక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ కేంద్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు(వృద్ధులు) ఆదివారం మంచాలు, నిత్యావసరకులు పంపిణీ చేశారు. రేణిగుంట మండలంలోని అత్తూరు గ్రామానికి చెందిన దాత కరుణాకర్ కేంద్రంలోని 25 మందికి వీటిని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, పునీత్, తేజ, యుగంధర్ పాల్గొన్నారు.

ఘనంగా సిపాయి జన్మదిన వేడుకలు



అన్నదానం చేస్తున్న సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పెండ్లిమండపం సెంటర్, పానగల్ వద్ద పలు సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా శ్రీకాళహస్తి, తిరుపతి, రాయలసీమ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తి ప్రజలంటే తనకు ఎంతో అభిమానమన్నారు. ఈ కార్యక్రమాల్లో వన్నెకుల క్షత్రియ సంఘం నాయకులు రత్నం రెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, చంద్రారెడ్డి, మిన్నల రవి, ఎంఎస్‌రెడ్డి, మాడుపూరు ప్రసాద్‌నాయుడు, లక్ష్మీపతిరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, కంతా ఉదయ్ పాల్గొన్నారు. అలాగే ఏర్పేడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద సిపాయి అభిమానులు 250 మందికి పైగా అన్నదానం చేశారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయంలో ఎమ్మెల్యే సత్యప్రభాకర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతుల భాస్కరరావు

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సత్య ప్రభాకర్‌రావు, తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం ఆలయ పండితులు ఆశీర్వదించారు. శ్రీస్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశా రు. ఆలయ అధికారులు సతీష్ మాలిక్, శ్రీనాథ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత నరసింగాపురం జట్టు



షీల్డు అందుకున్న విజేత జట్టుతో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి

రేణిగుంట: మండలంలోని కరకంబాడిలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతగా నరసింగాపురం జట్టు నిలిచింది. కరకంబాడి పంచాయతీ కార్యాలయ సమీపంలోని మైదానంలో జరిగిన రెండు రోజుల టోర్నమెంట్‌లో 30 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో కరకంబాడి, నరసింగాపురం జట్లు తలపడగా, నరసింగాపురం జట్టు విజేతగా నిలిచింది. వీరికి రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా రూ.20వేలు నగదు, కప్పు అందజేశారు. అలాగే రన్నరప్‌గా నిలిచిన కరకంబాడి జట్టుకు రూ.10వేలు, మూడవ స్థానంలో నిలిచిన నవీన్ ఫ్రెండ్స్ జట్టుకు రూ.5వేలు నగదు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించి, వారిలోని ప్రతిభను గుర్తించినప్పుడే మెరుగ్గా రాణిస్తారని అన్నారు. సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి, తిరుమలరెడ్డి, సుబ్రమణ్యం, వార్డు సభ్యుడు ఎస్.స్రుమణ్యం, పార్థసారథి, టోర్నీ కన్వీనర్ పీడీ బాబు, శివకుమార్, ఈశ్వర్, దిలీప్, గోవర్ధన్, శివప్రసాద్, భీమా, అశోక్‌రెడ్డి, బాలాజీనాయక్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం



మామిడిచెట్లల్లో అంతర పంటగా మిరప



మామిడి చెట్లల్లో అంతరపంటగా వేరుశనగ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతులు మామిడిలో అంతర పంటలుగా మిరప, మినుము, వేరుశనగ సాగు చేసి అదనపు ఆదాయం పొందుతున్నారు. మండలంలో 180 విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన అధికారుల సూచనల మేరకు రైతులు అంతర పంటలుగా మిరప, మినుము, వేరుశనగ సాగు చేపట్టారు. దీంతో నీటి ఖర్చు తగ్గుతుందని, మామిడి మొక్కలకు వినియోగించే నీటితోనే ఇతర పంటలు పండించుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. పంటల దిగుబడి బాగా వస్తుందని, మిరప, మినుము, వేరుశనగ పంటలకు వాడే ఎరువులు మామిడి మొక్కలకు కూడా అంది మొక్కలు ఏపుగా పెరుగుతాయని రైతులు అంటున్నారు. మామిడిలో ఐదేళ్ల వరకు అంతర పంటలను సాగు చేసుకోవచ్చని ఉద్యాన అధికారులు సూచిస్తున్నారు.

జోరుగా వరి కోతలు



తొండంబట్టులో వరి కోస్తున్న యంత్రం

వరదయ్యపాళెం: మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. రబీ ప్రారంభంలో సాగు చేసిన వరి పంట ప్రస్తుతం కోత దశకు చేరింది. ఈ క్రమంలో చిలమత్తూరు, సీఎల్ఎన్‌పల్లి, రాచర్ల, కోవూరుపాడు, అంబూరు, వరదయ్యపాళెం, తొండంబట్టు, చిన్న పాండూరు, పెద్ద పాండూరు ప్రాంతాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత రబీ సీజన్‌లో మండలంలో 3,800 హెక్టార్లలో వరి సాగులో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ఫిబ్రవరి నెలాఖరు వరకు వరికోతలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

తిరుపతి కల్చరల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్టు సీఐటీయూ, రైతు, వ్యవసాయ సంఘాల నేతలు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఆయా సంఘాల నేతల జిల్లా సదస్సు ని ర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలక్రిష్ణ మాట్లాడారు. దేశంలో లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ మీటర్లు పెట్టడం దారుణమన్నారు. మో దీ ప్రజా వ్యతిరేక విధానాలతో దగా చేస్తున్నారన్నారు. ప్రత్యేక హోదా ఇస్తామన్న మాట విస్మరించి మోసం చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలి

తిరుపతి అర్బన్: ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు టికెట్‌కు సరిపడా చిల్లర ఇవ్వడం లేదని కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, రిక్వెస్ట్ స్టాపింగ్‌లో డ్రైవర్లు బస్సులను నిలపడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులకు సహకరించాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేసినా కొందరు పెడచెవిన పెడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణికులకు ఆర్టీసీపై గౌరవం పెరిగేలా ఉద్యోగులు నడుచుకోవాలని హితవుపలికారు. తీరుమార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రయాణికులు కూడా టికెట్‌కు సరిపడా చిల్లర తెచ్చుకోవాలని కోరారు.

వానరమా..మజాకా



రేణిగుంట రైల్వే స్టేషన్‌లో శీతల పానీయ బాటిల్‌తో వానరం కుస్తీ

రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఓ వానరం ఆదివారం శీతల పానీయం బాటిల్‌ను ప్రయాణికుడి నుంచి లాక్కుని ఎంచక్కా నోటికి కరిపించుకుని సేవించింది. తొలుత బాటిల్‌లో ఉన్న కూల్ డ్రింక్‌ను కింద పోసి నాలుక పెట్టి రుచి చూసింది. తర్వాత బాటిల్‌ను నోటికి కరిపించుకుని దూరంగా వెళ్లి కూర్చుని ఎంచక్కా డ్రింక్ మొత్తాన్ని లాగించేసింది. దీన్ని అటుగా వెళుతున్న ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు.

-రేణిగుంట

విస్తారంగా వేరుశనగ సాగు



వరదయ్యపాళెం మండలం చెన్నవారిపాళెంలో వేరుశనగ సాగు

వరదయ్యపాళెం: మండలంలోని రైతులు వేరుశనగ పంటను విస్తారంగా సాగు చేశారు. సత్యవేడు వ్యవసాయశాఖ డివిజన్‌లోని 4 మండలాల్లో ప్రస్తుత రబీ సీజన్‌లో సాధారణంగా 1,905 హెక్టార్లలో పంట సాగు చేయాల్సి ఉంది. ప్రస్తుతం 1,600 హెక్టార్ల వేరుశనగ సాగైంది. గత ఏడాది వర్షాలు పుష్కలంగా పడడంతో బోర్లు, బావుల్లో నీరు సంవృద్ధిగా ఉంది. చెరువులు సైతం నిండాయి. ఈ క్రమంలో ఈ ఏడాది సాధారణ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వరదయ్యపాళెం మండలంలో ప్రధానంగా తొండంబట్టు, పెద్ద పాండూరు, వెంగారెడ్డికండ్రిగ, చెన్నవారిపాళెం, అరుదూరు, వరదయ్యపాళెం, లక్ష్మీపురం, కళత్తూరు, సిద్ధాపురం ప్రాంతాల్లో 160 హెక్టార్లలో వేరుశనగ సాగు చేశారు.

తెగుళ్లతో జాగ్రత్త

ఈ సీజన్‌లో వేరుశనగకు తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తాయని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారిణి సుహార్లత తెలిపారు. ముఖ్యంగా విత్తనం వేసిన 30 రోజుల్లోపు ఆకుమచ్చ తెగులు రెండు రకాలుగా వస్తుంది. దీని మచ్చలు చిన్నవిగా ఉండి ఆకు పైభాగంలో ముదురు గోధుమ రంగులో ఉంటుంది. అలాగే పంట వేసిన 40 రోజుల తర్వాత ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు. దీనినే తిక్క ఆకుమచ్చ తెగులు అని కూడా అంటారు. దీనిలో మచ్చలు పెద్దవిగా ఉండి మచ్చ ఉన్నచోట ఆకు కింద పైన రెండు వైపులా నల్లగా ఉండి మచ్చ చుట్టూ పసుపు రంగు వలయంలా ఉంటుంది. వీటి నివారణకు తెగులు రాకమునుపే ముందస్తు జాగ్రత్తగా ఎకరాకు మ్యాంకోజబ్ 400 మి.లీలు లేదా హెక్సకోనజోల్ 400 మి.లీలను లీటరు నీటిలో కలిపి పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఆకుముడత లేదా లద్దెపురుగు ఉంటే క్లోరో పైరీపాస్ 500 మి.లీ లేదా ఫినాలపాస్ 400 మి.లీలను పిచికారీ చేయాలి. తెగులు ఉద్ధృతి ఎక్కువగా ఉంటే ఫేమ్ 40 మి.లీ చొప్పున పిచికారీ చేయాలి. వేరుకుళ్లు, కాండం కుళ్లు వల్ల మొక్కలు చనిపోతుంటే స్యాప్ 500 మి.లీ లేదా బ్యావిస్టన్ 200 మి.లీల చొప్పున నేల తడిసేలా పిచికారీ చేయాలి.